జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com




# వంశధారను వదలండి

-అధికారులకు మంత్రి అచ్చెన్న ఆదేశం
-తాగునీటి అవసరాలకు వినియోగించాలని రైతులకు హితవు
-చెరువులు, కుంటను నింపాలని సూచన
-వేసవి నీటి ఎద్దడికి ముందస్తు చర్యలు



**శ్రీకాకుళం/ నిమ్మాడ, ఫిబ్రవరి 7(వార్త):** రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని వంశధార ప్రాజెక్టు నీటిని వినియోగించుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జలవనరుల శాఖ అధికారులకు ఆదేశించారు. ప్రాజెక్టులో ఉన్న నీటిని విడుదల చేయాలన్నారు. ఈ మేరకు కలెక్టర్, వంశధార ప్రాజెక్టు అధికారులతో శనివారం ఆయన ఫోన్‌లో మాట్లాడి పలు కీలక ఆదేశాలు ఇచ్చారు. ప్రాజెక్టు నీటిని విడిచిపెట్టాక చెరువులు, కుంటలు నింపి, ఆ నీటిని కేవలం తాగునీటికే వాడుకోవాలని రైతాంగానికి స్పష్టం చేశారు. ఈ విషయమై క్షేత్రస్థాయిలో రైతాంగానికి అవగాహన కల్పించాలని సూచించారు. నీటి లభ్యత విషయమై సానుకూలంగా ఆలోచించాలని ప్రజలను కోరారు. ప్రాజెక్టు నుంచి విడిచిపెట్టిన నీటితో చెరువులు, కుంటలు నింపుకోవాలని తద్వారా రానున్న వేసవి ఎద్దడి నివారించుకోవచ్చని అన్నారు. ముఖ్యంగా చెరువులు, కుంటలు నిండడంతో తాగునీటి అవసరాలు తీర్చుకునే నిమిత్తం మూగ జీవాలకు సైతం ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోని నీటిని వెంటనే విడిచిపెట్టాలని అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. తద్వారా రానున్న కాలంలో నీటి ఎద్దడి నివారణ సాధ్యం కానుందని, నీటి వనరుల లభ్యత తక్కువగా ఉండే విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు పరీవాహక ప్రాంతాల వారు కేవలం తాగు నీటి అవసరాలకే ప్రాజెక్టు నీటిని వాడుకోవాలని, వ్యవసాయ అవసరాలకు వాడుకోవద్దని స్పష్టం చేశారు.

-సాదరంగా ఆహ్వానించిన మంత్రి
-ఎదురేగి స్వాగతం పలికిన వైనం
-ఆయనతో కలిసి లంచ్
-మనవడిని పరిచయం చేసిన మాజీ మంత్రి

# లోకేష్‌తో శివాజీ ..భేటీ



**పలాస, ఫిబ్రవరి 7(వార్త):** రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌తో మాజీ మంత్రి గౌతు శ్యాం సుందర శివాజీ శుక్రవారం అమరావతిలో భేటీ అయ్యారు. లోకేష్ ప్రత్యేక ఆహ్వానం మేరకు తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన మాజీ మంత్రి గౌతు శ్యాం సుందర శివాజీకి ఆయన ఎదురేగి స్వాగతం పలికారు. ఆయనతో కలిసి భోజనం చేశారు. యోగ క్షేమాలు తెలుసుకున్నారు. లోకేష్.. నిత్య విద్యార్థి అని, పెద్దలను గౌరవించడాన్ని బాధ్యతగా ఆచరించే యువకుడని శివాజీ కితాబు ఇచ్చారు. అనంతరం ఆయనతో ప్రస్తుత రాజకీయాలు, ఆనాటి రాజకీయాలు, నైతిక విలువలు, పార్టీ బలోపేతం, నాడు పనిచేసిన శాఖల గురించి లోకేష్ అడిగి తెలుసుకున్నారు. శివాజీ అలనాటి ముచ్చట్లు చెబుతుంటే ఆసక్తిగా విన్నారు. పెద్దలను గౌరవించడం తల్లిదండ్రుల ద్వారా చిననాటి నుంచే అలవర్చుకున్న నారా లోకేష్, సీనియర్ల నుంచి సలహాలు తీసుకోవడంలోనూ, తెలియని విషయాలు నేర్చుకోవడంలోనూ నిత్య విద్యార్థిగా మారతారని గౌతు శివాజీతో భేటీతో మరోసారి రుజువైంది. తనతో పాటు మనవడు(ఎమ్మెల్యే శిరీష కుమారుడు) యార్లగడ్డ శ్రావణ్ శ్రీహర్ష ఉన్నారు. ఆయనను లోకేష్‌కు పరిచయం చేయడం, తమతో పాటు ఆసాంతం ఉంచడం రాజకీయ వర్గాలను ఆశ్చర్య పరుస్తోంది.

# శ్రీవారి లడ్డూ కల్తీపై ప్రాయశ్చిత్త దీక్ష

-జనసేన ఆధ్వర్యంలో ఆమదాలవలసలో నిర్వహణ
-సంఘీభావంగా తెలిపిన ఎమ్మెల్యే కూన రవికుమార్



**ఆమదాలవలస, ఫిబ్రవరి 7(వార్త):** పవిత్ర తిరుమలలో శ్రీవారి లడ్డూ కల్తీ జరిగిందని సిట్ రిపోర్ట్ నిర్ధారించినప్పటికీ క్షమాపణ చెప్పని వైసీపీ వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ ఆమదాలవలస నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్ రావు ఆమదాలవలసలో శనివారం ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కూన రవికుమార్ హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీక అయిన తిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రసాదంగా అందించే లడ్డూలో కల్తీ ఆరోపణలు రావడం అత్యంత బాధాకరమన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా గత వైసీపీ ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. శ్రీవారి ప్రసాదం పవిత్రతను కాపాడటం ప్రభుత్వాల బాధ్యత అని, అలాంటి అంశాల్లో నిర్లక్ష్యం చోటుచేసుకోవడం క్షమించరాని నేరమని పేర్కొన్నారు. ఈ విషయంలో పూర్తి స్థాయి విచారణ జరిపి సిట్ రిపోర్ట్ ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పేడాడ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ, భక్తుల ఆవేదనకు ప్రతీకగా ఈ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టామని తెలిపారు. శ్రీవారి మహిమకు మచ్చ తెచ్చే ప్రయత్నాలను జనసేన పార్టీ ఎట్టి పరిస్థితుల్లో సహించదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు మొదలవలస రమేష్, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీక్షకు మద్దతు తెలిపారు.

# ఏపీపీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

-రేపటి నుంచి నిర్వహణ
-లోటుపాట్లు తలెత్తనివ్వొద్దు
-జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.వి. లక్ష్మణమూర్తి




**శ్రీకాకుళం, ఫిబ్రవరి 7(వార్త):** జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్వీ లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న ఫారెస్ట్ బీట్ అధికారి, అసిస్టెంట్ బీట్ అధికారి, దేవాదాయ శాఖలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రేడ్ 3, ఎ.పి.ఫారెస్ట్ సబార్డినేట్ సర్వీస్ ఉద్యోగాలకు సంబంధించిన పరీక్షల నిర్వహణకు సంబంధించి సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎస్వీ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ఈ పరీక్షలు ఈ నెల 9 నుంచి 11 వరకు జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షలను ప్రభుత్వ డిగ్రీ కళాశాల (మెన్) శ్రీకాకుళం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల(ఉమెన్స్), అంబేద్కర్ యూనివర్సిటీ, ఎచ్చెర్లల్లో ఉదయం, మధ్యాహ్నం నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్ష లకు సంబంధించి 1375 మంది అభ్యర్థులు హాజరవుతారని, ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అభ్యర్థులకు తాగునీటి సదుపాయం కల్పించాలని, ఎగ్జామ్స్ సెంటర్ల వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశానికి పోలీస్, విద్యుత్, ఆర్టీసీ, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ వి.బాబూరావు, సెక్షన్ ఆఫీసర్ కె.భాస్కరరావు డిప్యూటీ తహసీల్దార్లు కె.శ్రీనివాసరావు, కె.శరత్ బాబు, ఎన్. నిర్మల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (మెన్ ) ప్రిన్సిపాల్ డా.వై.పోలినాయుడు, డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.సూర్యచంద్రరావు, డా. అంబేద్కర్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డా.సి.హెచ్. రాజశేఖర్‌రావు, కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీవాసుదేవ పెరుమాళుని బ్రహ్మోత్సవాలకు ..

# అంకురార్పణ

-భక్తి శ్రద్ధలతో క్షేత్ర పాలకుని అభిషేకమహోత్సవం -తరలివచ్చిన భక్తులు

**మందస, ఫిబ్రవరి 7(వార్త):** మందసలో వేంచేసిన శ్రీవాసుదేవపెరుమాళ్ 17వ బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు జైశ్రీమన్నారాయణ నామస్మరణతో ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 9గంటల వరకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలారాధన, నివేదన, గోష్ఠి, యాగశాలలో ధ్వారతోరణ, ధ్వజకుంభారాధన, వేద విన్నపములు, చతుఃస్థానార్చన, విశేషహోమములు, పంచసూక్తపరివార, ప్రాయశ్చిత్త హోమములు, నివేదన, నిత్యపూర్ణాహుతి, బలిహారణ, శాత్తుమురై, ప్రసాదగోష్టి తదితర కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు పర్యవేక్షణలో వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో డోకి రామారావు, భాగ్యలక్ష్మి దంపతులు నిర్మించిన శ్రీదాసాంజనేయునికి అభిషేకం, ప్రత్యేకపూజలు నిర్వహించారు. సుందరకాండ పారాయణాన్ని కావించారు. డోకి రామారావు కుమార్తె దేవరశెట్టి సంధ్యారాణి, ఉమామహేశ్వరరావు దంపతులు ఆంజనేయుని అభిషేకంలో పాల్గొన్నారు. ఆలయానికి భక్తుల తాకిడి క్రమేపీ పెరుగుతోంది. యజ్ఞం నిర్వహణకు యాగశాలను నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. సాయంత్రం శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, తీర్థగోష్టి జరిగింది. రంగు, రంగుల విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఆలయం సమీపంలో, కొత్తవీధిలో తాత్కాలిక అంగడీలు వెలిశాయి. కొత్తవీధిలో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు మాట్లాడుతూ శ్రీవాసుదేవ పెరుమాళ్ బ్రహ్మోత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. స్వామి వారిని బ్రహ్మోత్సవాల సమయంలో దర్శించుకుంటే మోక్షం కలుగుతుందన్నారు. స్వామి వారి కల్యాణం కడు రమ్యంగా జరుగుతుందన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల నుంచి వేద పండితులు అర్చకులు, ఆధ్యాత్మికవేత్తలు, భక్తులు చేరుకుంటున్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు శానాపతి కిశోర్‌కుమార్, దేవరశెట్టి మార్కండేయులు, వడ్డి చంద్రశేఖరం, కిల్లంశెట్టి నాగేశ్వరరావు, జామి ప్రసాదరావు, కరతల తిరుపతిరావు(నారాయణరావు), కె.మల్లేశ్వరరావు, గొర్లె కుశరాజు, సాసుమాన యోగి తదితరులు పాల్గొన్నారు.





## దర్శించుకున్న ఎంఎల్ఏ శిరీష..

మందసలో జరుగుతున్న శ్రీవాసుదేవ పెరుమాళ్ 17వ బ్రహ్మోత్సవాలలో పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష పాల్గొన్నారు. శనివారం సాయంత్రం ఆలయానికి ఆమె రాగా, ఆలయ మర్యాదలతో అర్చకులు ఆహ్వానం పలికారు. ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు శిరీష కుటుంబం పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ విశిష్టతను ఆమెకు వివరించారు. దుశ్శాలువతో సన్మానించి, స్వామి వారి తీర్థ, ప్రసాదాలు అందించారు. అనంతరం ఆమె బ్రహ్మోత్సవాల సందర్భంగా జరుగుతున్న ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆమె వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పాఠశాల విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు

**నరసన్నపేట, ఫిబ్రవరి 7(వార్త):** రావులవలస ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. సాయి డెంటల్ కళాశాలకు చెందిన ట్రైనీ వైద్యులు ఈ పరీక్షలను చేపట్టారు. వైద్యులు విద్యార్థుల దంత ఆరోగ్యాన్ని పరిశీలించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. దంత సమస్యలు ఉన్న చిన్నారులను గుర్తించి తదుపరి చికిత్స కోసం ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలకు దంతాలను సురక్షితంగా ఉంచుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా దంతాలు శుభ్రపరచుకోవాలని, తీపి పదార్థాలను పరిమితంగా తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల దంత ఆరోగ్య పరిరక్షణకు ఎంతగానో ఉపయోగపడిందని పాఠశాల సిబ్బంది తెలిపారు.



## శ్రీదేవి జన్మదిన వేడుకల్లో కిశోర్



**మందస, ఫిబ్రవరి 7(వార్త):** మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత డాక్టర్ సీదిరి అప్పలరాజు సతీమణి సీదిరి శ్రీదేవి జన్మదిన వేడుకల్లో వైకాపా నాయకుడు, పార్టీ యువజన అధ్యక్షుడు శానాపతి కిషోర్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ మంత్రి అప్పలరాజుతో కొంతసేపు పార్టీ విషయాలపై ఆయన చర్చించారు. వీరితో పాటు మందస మండల నాయకులు కూడా ఉన్నారు.

## గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులహ్వానం

### -ప్రిన్సిపాల్ శ్రీనివాస్ దేవి



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 7(వార్త):** పెద్దపాడు డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకులంలో 2026-27లో 5వ నుంచి 10వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 19లోగా బాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ దేవి కోరారు. రూ.100 చెల్లించి, https://apbragcet.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9440827106 సంప్రదించాలన్నారు.

## ప్రభుత్వ విద్య ప్రాధాన్యతపై కరపత్రం విడుదల



**మందస, ఫిబ్రవరి 7(వార్త):** లింబుగాం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ విద్య ప్రాధాన్యతను వివరిస్తూ కరపత్రం విడుదల చేశారు. ప్రధానోపాధ్యాయుడు మార్పు జగన్మోహనరావు ఆధ్వర్యంలో నో బ్యాగ్ డే రోజున 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన కొత్త జాయినింగ్ కు కరపత్రం ఆవిష్కరణ చేశారు. ఎస్ఎంసీ చైర్మన్ సాలిన వెంకటరావు, పత్రి మోహనరావు, సీనియర్ ఉపాధ్యాయులు పిన్నింటి కొండలరావు, గున్న రాజు, దున్న మన్మథరావు, పూజారి తాతారావు, అంగన్వాడి కార్యకర్త మామిడి కృష్ణవేణి, రాపాక ప్రవీణ్ కుమార్, సీఆర్ఎంటీ మండల లక్ష్మీనారాయణ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రతీ బుధవారం సాయంత్రం 3.30నుండి 4గంటల వరకు యోగా కార్యక్రమం ఉంటుందని, 1వ శనివారం, 4వ శనివారం నో బ్యాగ్ డే కార్యక్రమాలలో భాగంగా క్విజ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం, ముస్తాబు కార్యక్రమం చేపట్టడలు తదితర అంశాలు పాఠశాలలో ఉంటాయన్నారు. ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పుస్తక నిర్వహణ మెరుగు పరచాలి



**మందస, ఫిబ్రవరి 7(వార్త):** స్వయం సహాయక సంఘాలు కొత్తగా మళ్లీ లోన్ తీసుకునే ముందు సభ్యులంతా సమావేశమై, సంఘం లెక్కలు అన్నింటిని సభ్యురాలు వారి ఖచ్చితంగా పొదుపులు, అప్పులు వివరాలను చర్చించి, అవగాహన చేసుకుని పుస్తకాలలో పారదర్శకంగా నమోదు చేసుకోవాలని వెలుగు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ మందస అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు సూచించారు. మండల కేంద్రంలో గల ఏపీఎం కార్యాలయంలో సంఘ సభ్యులకు సంఘాల రికార్డుల నిర్వహణను పరిశీలిస్తూ మాట్లాడారు. పుస్తక నిర్వహణ సరిగా లేని సంఘాలలో ఆర్థికపరమైన అవకతవకలకు అవకాశం ఎక్కువగా ఉంటుందని వివరించారు. గ్రామీణ ప్రాంతంలో ముఖ్యంగా నిరక్షరాస్యులు అయిన మహిళలు పుస్తక నిర్వహణ లేని కారణంగా నష్టపోకూడదని సూచించారు. ప్రభుత్వం ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమంలో వలంటీర్ల ద్వారా అందరికీ కనీస అవగాహనకు చదువు నేర్పిస్తున్నందున నిరక్షరాస్య మహిళలంతా కార్యక్రమాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు, క్లస్టర్ కోఆర్డినేటర్ బాలకృష్ణతో పాటు బొందికారి వీవోఏ దేవి తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్పీగా ఎంపికైన సుందరరావుకు ఘన స్వాగతం

**నరసన్నపేట, ఫిబ్రవరి 7(వార్త):** రావులవలస గ్రామానికి చెందిన పైల సుందర్ రావు ఇటీవల విడుదలైన గ్రూప్--1 పరీక్షల్లో డీఎస్పీగా ఎంపికైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఆయన తొలిసారిగా స్వగ్రామానికి రావడంతో గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలు వేసి, నినాదాలతో ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకువచ్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన సుందర్ రావు ఈ స్థాయికి చేరుకోవడం గ్రామానికి గర్వకారణమని గ్రామస్థులు పేర్కొన్నారు. ఆయన విజయం గ్రామంలోని యువతకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా పలువురు పెద్దలు మాట్లాడుతూ కష్టపడి చదివితే ఉన్నత స్థానాలు సాధించవచ్చని సుందర్ రావు నిరూపించారని అభినందించారు. గ్రామంలో ఆనందోత్సాహ వాతావరణం నెలకొంది.



# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

### -మంత్రి అచ్చెన్నాయుడు



**కోటబొమ్మాళి, ఫిబ్రవరి 7(వార్త):** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. శనివారం నిమ్మాడలోని తన నివాస కార్యాలయంలో పంచాయతీరాజ్, నీటి పారుదల శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేపట్టిన మౌలిక సదుపాయాల కల్పన పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మార్చి నెలాఖరులోగా అన్ని పనులను పూర్తి చేయాలని, ఏ గ్రామంలో చూసినా మట్టి రహదారులు కనిపించకుండా సిమెంటు రహదారులు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, బకాయి ఉన్న బిల్లుల వివరాలన్నింటినీ వెంటనే అంతర్జాలంలో నమోదు చేయాలని ఆదేశించారు. రైతుల సంక్షేమం కోసం నియోజకవర్గంలో కొత్తగా రెండు ఎత్తిపోతల సాగునీటి పథకాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. సంతబొమ్మాళి మండలం వాడ్రాడ, కొండపేట ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. వీటితో పాటు మదనగోపాల సాగరం ప్రాజెక్టు పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఉపాధి హామీ పథకం స్థానంలో కొత్త పథకం రానున్న నేపథ్యంలో, పాత పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ సమీక్షలో ఆర్డీవో కృష్ణమూర్తి, ఆయా శాఖల అధికారులు సుధాకర్, వీరన్నాయుడు, రామకృష్ణ, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలి

- గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు చర్యలు
- పకడ్బందీగా యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే
- ఇంటి పన్ను ఆన్‌లైన్‌లో చెల్లించాలి
- ఎంపీడీఓ రామకృష్ణారావు



**జి.సిగడాం, ఫిబ్రవరి 7(వార్త):** ప్రభుత్వం ఆదేశాల మేరకు సచివాలయ ఉద్యోగులకు, విర్వోలకు కేటాయించిన సర్వేలు, ప్రణాళికలు ఉద్యోగ వివిధ పనులను నిర్ణీత గడుపులోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ జి.రామకృష్ణారావు సూచించారు. అందరూ కలిసి సమన్వయంతో పనిచేసినప్పుడే మంచి ఫలితం వస్తుందని ఆయన తెలిపారు. శనివారం ఆయన మండల పరిధిలో సచివాలయ సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సర్వేలు, తదితర అంశాలపై అరా తీశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిర్వహించాలని పేర్కొన్నారు.

### పరిసరాల స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత..



పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యకరంగా ఉంటామని పంచాయతీ కార్యదర్శి జాన్సీ అన్నారు.శనివారం మర్రివలస గ్రామంలో తడి, పొడి చెత్త సేకరణ పై ప్రజలకు అవగాహన కల్పించారు.పరిసరాల స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యతగా తడి, పొడి చెత్త విడివిడిగా కేటాయించి పారిశుధ్య నిర్వహణ వాహనాలు వచ్చినప్పుడు వారికి అందజేయాలని కార్యదర్శి జాన్సీ అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత బాధ్యతగా స్వీకరించిన నాడే ఆరోగ్యవంతమైన సమాజంలో జీవించవచ్చున్నారు.తడి,పొడి చెత్త సేకరించి చెత్త నుండి సంపద కేంద్రానికి తరలించి సేంద్రియ ఎరువులు తయారీకి వినియోగిస్తారన్నామని ' ఆ ఎరువును రైతులు పంటపొలాలకు ఉపయోగించుకోవచ్చాన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి యునీఫైడ్ ఫ్యామిలీ సర్వే ను నిర్వహించారు.ప్రతి వ్యక్తి యొక్క వివరాలు అడిగి తెలుసుకొని ప్రభుత్వ అన్లైన్ రికార్డుల్లో నమోదు ప్రక్రియ చేపట్టారు.

### ఆధార్ ఆధారంగా వివరాల సేకరణ ..



జగన్నాధవలస గ్రామంలో పంచాయితీ కార్యదర్శి మజ్జి ధనలక్ష్మీ ఆధ్వర్యంలో వారితో పాటు సచివాలయ సిబ్బంది గ్రామంలో ఇంటింటికి వెళ్లి యునీఫైడ్ ఫ్యామిలీ సర్వేను నిర్వహించారు.ప్రతి వ్యక్తి యొక్క వివరాలు అడిగి తెలుసుకొని ప్రభుత్వ అన్లైన్ రికార్డుల్లో నమోదు ప్రక్రియ చేపట్టారు.ప్రభుత్వ పథకాలకు అర్హులను ఎంపిక చేసేందుకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా పారదర్శకంగా లబ్ధిదారులను గుర్తించాలనే లక్ష్యంతోనే యునీఫైడ్ ఫ్యామిలీ సర్వే' చేపట్టామన్నారు.38 రకాల వివరాలను నమోదు చేసి, వ్యక్తుల ఈకేవైసీ చేస్తున్నామని. యునీఫైడ్ కుటుంబ సర్వేతో ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అసలైన అర్హులను గుర్తించేందుకు కీలకంగా దోహదపడుతుందని వారు చెప్పుకొస్తున్నారు.

### స్వచ్ఛందంగా ఇంటి పన్నులు చెల్లించాలి..

ప్రతి ఇంటికీ స్వచ్ఛంధంగా పన్నులు చెల్లించాలని పంచాయితీ కార్యదర్శి జాడ కిషోర్ బాబు అన్నారు.శనివారం ఆనందపురం గ్రామంలో ఇంటి పన్నులు వసూళ్లు చేశారు.గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు పన్నుల చెల్లింపు కూడా ముఖ్యమేనని పేర్కొన్నారు. పన్నుల చెల్లింపుల ఆధారంగా ప్రభుత్వం ద్వారా కూడా నిధులు మంజూరవుతాయని అన్నారు.గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తమవంతు కృషిచేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల్లో వసూలు చేసే ఇంటి పన్నులు దారిమళ్లకుండా నేరుగా పంచాయతీ అకౌంట్లకు జమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని. అందుకోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్ ద్వారా పన్ను చెల్లింపునకు అవకాశం కల్పించింది తెలిపారు.ఇంటి యజమానులకు అవగాహన లేకపోతే సచివాలయం వద్దకు వెళ్లి వివరాలు అందజేస్తే, క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు చేయవచ్చు అని కిషోర్ గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు.

# ఎరువుల సరఫరాలో గందరగోళం

### -మండల సభ్యుల ఆవేదన

**నరసన్నపేట, ఫిబ్రవరి 7 (వార్త):** నరసన్నపేట మండల పరిషత్ సర్వసభ సమావేశం ఎంపీపీ ఆరంగి మురళీధర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎరువుల సరఫరా వ్యవహారంపై సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఎరువుల పంపిణీలో గందరగోళానికి కారణమవుతున్నారని ఆరోపించారు. ఎరువుల సరఫరాలో కొందరికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, అర్హులైన రైతులకు సమయానికి ఎరువులు అందడంలేదని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ సీజన్‌లో ఇలాంటి నిర్లక్ష్యం రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని తెలిపారు. అదే సమయంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు అధికారిక కార్యక్రమాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వడంలేదని కొందరు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ప్రజాప్రతినిధుల గౌరవాన్ని కాపాడే విధంగా అధికారులు వ్యవహరించాలని వారు కోరారు. సమావేశంలో వివిధ ప్రజా సమస్యలపై చర్చ జరగగా, సంబంధిత శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.



## గణిత క్విజ్ పోటీల్లో బుడితి విద్యార్థుల ప్రతిభ




**సారవకోట, ఫిబ్రవరి 7(వార్త):** సారవకోటలో గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల గణిత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత క్విజ్ పోటీల్లో బుడితి విద్యార్థులు ప్రతిభ చాటారు. శనివారం బుడితి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ పోటీల ఫలితాలను ప్రకటించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రాము మాట్లాడుతూ ఆరు, ఏడో తరగతులకు చెందిన నిరోషా, తేజ సాయి, వందన, మోహిత విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచారని తెలిపారు. విద్యార్థుల విజయం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంతో పాటు స్థానిక ఉపాధ్యాయులు విజేత విద్యార్థులను అభినందించి వారి ప్రతిభను ప్రశంసించారు. ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంపొందించి మేధస్సు వికాసానికి దోహదపడతాయని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

## ఈ-గవర్నెన్స్' సేవలతో ప్రజలకు ఎంతో మేలు



**మందస, ఫిబ్రవరి 7(వార్త):** ఈ-గవర్నెన్స్ సేవలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ చెపారు. మందసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను మరింత సులభంగా, వేగం ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు రూపొందించిన ఈ-గవర్నెన్స్ సేవలను ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్ లో 091 9552300009 నెంబర్ ను సేవ్ చేసుకుని, వాట్సాప్ లో 'హాయ్' అని మెసేజ్ పంపితే, ప్రభుత్వానికి సంబంధించిన అనేక సేవలు వెంటనే అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ సేవల ద్వారా వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమాచారం మాత్రమే కాకుండా, ముఖ్యంగా పోలీస్ శాఖకు సంబంధించిన సేవలను సులభంగా తెలుసుకునే అవకాశం ఉందన్నారు. పోలీస్ శాఖ పరిధిలో ఈ చలానాలు, ఎఫ్ఐఆర్ కాపీలు, ఎఫ్ఐఆర్ పురోగతి వివరాలు తదితర సమాచారాన్ని వాట్సాప్ ద్వారానే పొందవచ్చని స్పష్టం చేశారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ఇంటి నుంచే ప్రభుత్వ సేవలను పొందేలా ఈ-గవర్నెన్స్ వ్యవస్థ ఉపయోగపడుతుందని, ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ కృష్ణప్రసాద్ కోరారు.

## ప్రముఖ సంస్కృతాంధ్ర పండితుడు శర్మ మృతి



**నరసన్నపేట, ఫిబ్రవరి 7(వార్త):** ప్రముఖ సంస్కృతాంధ్ర పండితులు భాస్కరభట్ల నరసయ్య శర్మ శనివారం తెల్లవారుజామున నరసన్నపేట మండలం సత్యవర అగ్రహారంలో కన్నుమూశారు. ఆయన మృతితో సత్యవరతో పాటు శ్రీకాకుళం జిల్లా సాహిత్య, ఆధ్యాత్మిక వర్గాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. శ్రీకాకుళం జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా సేవలందించిన నరసయ్య శర్మ తెలుగు, సంస్కృత భాషల్లో అపార పాండిత్యాన్ని ప్రదర్శించారు. విద్యార్థులకు భాషాపై ఆసక్తిని పెంపొందించడంలో ఆయన విశేష కృషి చేశారు. అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి క్షేత్రంలో ఆయన అనేక ఆధ్యాత్మిక, సాహిత్య, జ్యోతిష అంశాలపై చేసిన ప్రసంగాలు శ్రోతలను విశేషంగా ఆకట్టుకున్నాయి. సాంప్రదాయ విలువలు, ధార్మిక ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన సేవలు మరపురానివిగా నిలిచాయి. నరసయ్య శర్మ మృతిపట్ల ఆయన శిష్యులు, అభిమానులు, సాహిత్యాభిమానులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఆరంగి మురళీధర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు సంతాపం తెలిపారు.

## సమ్మె విజయవంతంచేయండి

**పలాస, ఫిబ్రవరి 7(వార్త):** ఈనెల12 వ తారీఖున జరుగుతున్న జాతీయ సార్వత్రిక సమ్మె విజయ వంతం చేయడానికి శనివారం పలాస-కాశీబుగ్గలో గల అన్ని బ్యాంక్లకు, కార్మికులకు సమ్మె నోటీసులు పంపిణి చేశారు. 12వ తారీఖున జరిగే సమ్మెకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎంల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు మద్దిల రామారావు, ఎఐసిసిటియు జిల్లా నాయకులు పిన్నింటి నాగేశ్వరరావు, కుత్తుం లోకనాదం, కూర్మారావు, గోపి పాల్గొన్నారు.



జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

## సర్వే ప్రక్రియలో ముందుండాలి

### -ఎంపీడీవో నరసింహా ప్రసాద్ పండా

**మెళియాపుట్టి, ఫిబ్రవరి 7(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు మండలంలో నిర్వహిస్తున్న యునిఫైడ్ ఫ్యామిలీ సర్వే ప్రక్రియను సకాలంలో పూర్తిచేసి ముందుండాలని ఎంపీడీవో నరసింహా ప్రసాద్ పండా అన్నారు. మండలంలో చాపర, మెలియాపుట్టి తదితర గ్రామాలలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. శనివారం నాడు సచివాలయం సిబ్బంది చాపర, నడసంద్ర, వసుంధర తదితర గ్రామాల్లో సర్వే చేస్తున్న క్రమంలో ఆయన క్షేత్రస్థాయిని సందర్శించి సిబ్బందితో మాట్లాడుతూ వేగవంతంగా సర్వే నిర్వహించి సర్వేలో ముందుండాలన్నారు. అలాగే ఇంటి పన్నులను వేగవంతం చేయాలన్నారు.



# సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే శిరీష చొరవ



**పలాస, ఫిబ్రవరి 7 (వార్త):** ప్రజా సమస్యలను ఓపికగా వినడమే కాదు, వాటిని తక్షణమే పరిష్కరించే దిశగా అడుగులు వేస్తూ, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తనదైన ముద్ర వేస్తున్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆమె చూపిన చొరవ, మానవత్వం, ప్రజల పట్ల ఆమెకున్న అంకితభావానికి నిదర్శనంగా నిలిచింది. గ్రీవెన్స్ కార్యక్రమంలో 31 వినతులు వచ్చినట్ల తెలిపారు. ఈ గ్రీవెన్స్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి మొత్తం 31 వినతులు అందాయి. ప్రజలు ప్రధానంగా పెన్షన్లు, ఉద్యోగాలు, భూ వివాదాలు, ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణాలు, సిసి రోడ్లు, వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఒక్కరి సమస్యను గౌతు శిరీష ఓపికగా విన్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే తన చరవాణి ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కరించారు. మరికొన్ని సమస్యలను సంబంధిత శాఖల అధికారులకు పంపి, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలందరి సమస్యలు తీరేవరకు ఓపికగా సమాధానమిచ్చి, వారికి పూర్తి భరోసా కల్పించి పంపించారు. తల్లి ఆవేదనకు చలనం.. చిన్నారి బాధ్యత స్వీకరణ ఈ కార్యక్రమంలో ఒక సంఘటన ప్రత్యేకంగా నిలిచింది. తన చిన్నారికి రెండు చెవులకు ప్లాంటేషన్ ఆపరేషన్ చేయించానని, అయితే ఆ బిడ్డకు పెన్షన్ మంజూరు చేయాలని ఓ తల్లి ఎమ్మెల్యేను కోరారు. ఆపరేషన్ తర్వాత చిన్నారికి అవసరమైన స్పీచ్ థెరపీ గురించి ఎమ్మెల్యే ఆరా తీయగా, తన భర్త చనిపోయాడని, ఆర్థిక ఇబ్బందుల వల్ల థెరపీ చేయించలేకపోతున్నానని ఆ తల్లి కన్నీటిపర్యంతమైంది. ఆ తల్లి నిస్సహాయతకు తక్షణమే చలించిపోయిన ఎమ్మెల్యే శిరీష, ఇటీవల కాశీబుగ్గలో ప్రారంభమైన హియరింగ్ థెరపీ హాస్పిటల్ యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడారు. చిన్నారి స్పీచ్ థెరపీకి అయ్యే ఖర్చు మొత్తం గ్లో - సంస్థ ద్వారా తామే భరిస్తామని, వెంటనే చికిత్స ప్రారంభించాలని కోరారు. "మీరు బిడ్డను తీసుకుని నేరుగా హాస్పిటల్‌కు వెళ్ళండి, నేను మాట్లాడాను," అని ఆ తల్లికి భరోసా ఇచ్చి పంపించిన ఆమె తీరు అక్కడున్నవారిని కదిలించింది. ఈ సంఘటన ఎమ్మెల్యేకి ప్రజల పట్ల ఉన్న ప్రేమ, బాధ్యతలకు నిలువుటద్దం పడుతోంది. కేవలం ప్రజా ప్రతినిధిగా కాకుండా వారిలో ఒకరిగా కష్టాలను అర్థం చేసుకుని, పరిష్కారం చూపే ఆమె నాయకత్వ పటిమపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన నాయకులు, పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు వివరాలు గుర్తించాలి



**సారవకోట, ఫిబ్రవరి 7(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం అవసరమైన వివరాలను గుర్తించి నమోదు చేయాలని సర్వశిక్ష అభియాన్ సిఎంఓ శ్రీధర్ సూచించారు. శుక్రవారం సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల కమిటీ అధ్యక్షులకు విద్యాంజలి కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, విద్యా సామగ్రి, వసతుల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. అలాగే పాఠశాల అభివృద్ధికి సహకరించేందుకు ముందుకు వచ్చే దాతలు, స్వచ్ఛంద సంస్థలు (ఎన్జీఓలు) సంబంధిత వివరాలను విద్యాంజలి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. విద్యాంజలి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన వనరులు సమకూర్చుకొని విద్యా ప్రమాణాలను మెరుగుపరచుకునే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వెంకన్నకు బంగారు కవచం బహుకరణ



**సారవకోట, ఫిబ్రవరి 7(వార్త):** చీడిపూడి గ్రామంలో కొలువైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అదే గ్రామానికి చెందిన గేదెల మోహన్ బాబు శుక్రవారం బంగారు కవచాన్ని బహుకరించారు. భక్తి శ్రద్ధలతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఆలయ అర్చకులు రామానుజాచార్యులు స్వామి వారి మూల విగ్రహానికి బంగారు కవచాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కవచం విలువ సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. మాఘ మాసం పురస్కరించుకొని శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, ఆర్జిత సేవలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి దర్శనం చేసుకున్నారు.

## అక్షర ఆంధ్రతో విద్యాభివృద్ధి



**పోలాకి, ఫిబ్రవరి 7(వార్త):** అక్షరాలతోనే సమాజ భవిష్యత్తును మార్చవచ్చని శాసన సభ్యులు బగ్గు రమణమూర్తి అన్నారు. అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పోలాకి మండలం కత్తిరివానిపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలంటే విద్యార్థులకు నాణ్యమైన విద్యా సామగ్రి అందుబాటులో ఉండాలని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పోటీ ప్రపంచంలో ముందుకు రావడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. అక్షర ఆంధ్ర కార్యక్రమం ద్వారా పిల్లల్లో చదువుపై ఆసక్తి పెరిగి వారి ఆలోచనా విధానం మరింత విస్తృతమవుతుందని చెప్పారు. విద్య అనేది వ్యక్తి జీవితానికే కాకుండా సమాజ అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి జ్ఞానం, నైపుణ్యాలతో బలంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి పిఎసిఎస్ ఛైర్మన్ భైరి భాస్కరరావు, కాయ రవి, ధర్మాన అమ్మనాయుడు, ఎంపీడీవో, కూటమి నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయొద్దు

**మందస, ఫిబ్రవరి 7(వార్త):** కొండలోగాం గ్రామంలో గిరిజనులను చైతన్య పరిచి, 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐఎంఎల్ జనశక్తి నాయకుడు కోనేరు రమేష్, గిరిజన సంఘం నాయకులు పిలుపునిచ్చారు. కొండలోగాంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీల సమన్వయంతో అనేక పోరాటాల ఫలితంగా వచ్చిన మహాత్మగాంధీ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచి, పూర్తిగా లేకుండా చేయడానికి పన్నాగాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అల్లుతున్నాయని, ఇందుకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు నడిపి, ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు. దేశంలో గల సంపదను కార్పొరేట్లకు అప్పనంగా అప్పజెప్పి ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. మనిషి జీవితంలో భాగమైన, విడదీయరాని విద్య, వైద్యాన్నికూడా పీ4 పద్ధతిలో ప్రైవేటీకరిస్తున్నారంటే, ఇంతకంటే దారుణం ఇంకొక రాష్ట్రంలో ఉండదన్నారు. ప్రభుత్వం తన ఇష్టారాజ్యాంగ 99పైసలకే భూములు కార్పోరేట్లకు అప్పజెప్పడం దారుణం అన్నారు. కార్మిక, రైతాంగ చట్టాలన్నింటినీ కాల రాసి, తేలికపాటి చట్టాలుగా మార్చి4లేబర్ కోడ్లుగా మార్చి, కార్మికులను వీధిలో పడేసారన్నారు. 8గంటల పని దినాన్ని 12గంటలు చేయాలనీ ప్రభుత్వే డిమాండ్ చేస్తోందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విదినాలకు వ్యతిరేకంగా కలిసి పోరాడి, హక్కులు కాపాడుకోవాలన్నారు. సమస్యలతో కూడిన మెమోరాండాన్ని తహసీల్దార్ మిస్క శ్రీకాంత్ కు అందజేశారు. కార్యక్రమంలో స్త్రీవిముక్తి, గిరిజన సంఘం నాయకులు సవర నరసింహులు, సవర తులసీ, జయరాం, మాదవరావు, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



## ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 7(వార్త):** ఇచ్ఛాపురంలోని స్వర్ణ భారతి డిగ్రీ కళాశాలలో మేరా యువ భారత్ ఆధ్వర్యంలో "మై భారత్ బడ్జెట్ క్వెస్ట్ 2026" పై శనివారం ఆన్ లైన్ క్విజ్ పోటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేరా యువ భారత్ జాతీయ యువ కార్యకర్త హంగీర్ బెహరా మాట్లాడుతూ, కేంద్ర బడ్జెట్ 2026 ఆధారంగా రూపొందించబడిన ఈ ఆన్లైన్ క్విజ్ కార్యక్రమం యువతకు బడ్జెట్‌పై ప్రాథమిక అవగాహన కల్పించడానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. బడ్జెట్‌లో ఉన్న ముఖ్య అంశాలు, అభివృద్ధి పథకాలు, యువతకు కలిగే అవకాశాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ భారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ క్విజ్ పోటీ ద్వారా విద్యార్థుల్లో దేశ ఆర్థిక వ్యవస్థపై అవగాహన పెంపొందించ దంతో పాటు, జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం కలుగుతుందని తెలిపారు.

## జెమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు




**శ్రీకాకుళం, ఫిబ్రవరి 7(వార్త):** జెమ్స్ హాస్పిటల్ సహకారంతో మదర్ తెరిసా ఎవరు గ్రీన్ ట్రస్ట్ విశాఖపట్నం వారి నిర్వహణతో ఆదర్శ శ్రీకాకుళం బాప్టిస్ట్ చర్చి నందు పాస్టర్ ఎల్ దేవానంద్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు ఈ క్యాంపు నందు చెమ్స్ హాస్పిటల్ డాక్టర్ ఈ భరద్వాజ్ చేయ గౌతమి కె ఈశ్వరరావు మార్కెటింగ్ మేనేజర్ రవిబాబు పాల్గొన్నారు సుమారుగా 200 మందికి ఉచిత వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగినది. పై క్యాంపు విషయంలో స్థానికులు ప్రజలు వాళ్ళ ఆనందాన్ని వ్యక్తం చేసింది

## రాయగడ జట్టు విజయం



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 7(వార్త):** వెచ్చ జయంతి స్మారక అంతరాష్ట్ర క్రికెట్ పోటీలో భాగంగా బరంపురం లీడ్స్ స్పోర్టింగ్ క్లబ్, రేవోల్ట్ క్లబ్ రాయగడ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో రాయగడ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా నిర్ణీత 20 ఓవర్లు లో 113 పరుగులకి ఆలౌట్ అయ్యింది. రాయగడ బౌలర్ చక్రపాణి 4వికెట్లు తీసుకోగా, అనంతరం రాయగడ జట్టు 109 పరుగులకి ఆలౌట్ అయ్యారు. బేర్హంపూర్ బౌలర్ శిశిర బెహరా 3వికెట్లు తీసుకున్నారు అంపైర్ గా యోగి మరియు ప్రేమ్ వ్యవహారించారు మ్యాచ్ ని కేశవరావు కాళ్ళ దిలీప్ యాదవ్ బత్తిన కృష్ణయ్య షేక్ మున్నా పర్యవేక్షించారు మ్యాన్ అఫ్ ది మ్యాచ్ గా చక్రపాణి ఎన్నికయారు.

## పకడ్బందీగా నవోదయ పరీక్ష

**సరుబుజ్జిలి, ఫిబ్రవరి 7(వార్త):** సరుబుజ్జిలి మండలంలోని శ్రీ శ్రీశ్రీ వెంకట సాయి స్కూలులో 9వ తరగతి ప్రవేశ నవోదయ పరీక్షకి 335 మందిని పరీక్షా కేంద్రానికి కేటాయించడం జరిగింది. అందులో 246 మంది హాజరు అయ్యారు 89 మంది హాజరు కాలేదు ఈ పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరెంట్ గా బి పురుషోత్తమరావు బిఎల్ఓ గా సత్యనారాయణ గారు మరియు పాఠశాల సిబ్బంది సమక్షంలో పరీక్షాన్ని నిర్వహించడం జరిగింది.



# నేటి నుంచి జర్నలిస్టులకు శిక్షణా తరగతులు

### - సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సోంపేటలో ఏర్పాట్లు

### -హాజరుకానున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్



**సోంపేట, ఫిబ్రవరి 7(వార్త):** సి ఆర్ మీడియా అకాడమీ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో గ్రామీణ జర్నలిస్టుల శిక్షణా తరగతులకు సోంపేట వేదికగా మారింది. స్థానిక విబిఆర్ ఫంక్షన్ హాల్ లో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి.. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల తోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విలేకరులు శిక్షణ తరగతులకు హాజరుకానున్నారు. ఆది సోమవారాల్లో నిర్వహించనున్న ఈ శిక్షణ తరగతులలో శిక్షణ పొందిన పాత్రికేయులకు మీడియా అకాడమీ ద్వారా ధ్రువపత్రాలు అందించనున్నారు.

### అతిరథుల రాక..

ఏపీయూడబ్ల్యూజే శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరగనున్న ఈ శిక్షణా తరగతుల కార్యక్రమానికి రాష్ట్రం నుంచి మీడియా అకాడమీ పెద్దలు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు హాజరుకానున్నట్లు జిల్లా అధ్యక్షులు సిహెచ్ జగదీష్ ఒక ప్రకటనలో తెలిపారు. మీడియా అకాడమీ ఆంధ్ర ప్రదేశ్ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్, ఐజేయు జనరల్ సెక్రటరీ డి సోమ సుందర్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు, జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లధర్మం కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, స్థానిక ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు తదితరులు హాజరుకానున్నారు.

### వివిధ అంశాలపై శిక్షణ..

ఈ కార్యక్రమంలో పాత్రికేయులకు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఏపీడబ్ల్యూజే అధ్యక్షులు జగదీష్ తెలిపారు. కృత్రిమ మేధ అంశంపై సీనియర్ జర్నలిస్టు విజయ్ కుమార్, క్రైమ్ న్యూస్ అంశంపై ఆర్టివి బ్యూరో చీఫ్ రామచంద్రరావు, ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టింగ్అంశంపై కూర్మరాజు ఈటీవీ బ్యూరో చీఫ్, పత్రికా భాష అంశంపై సీనియర్ జర్నలిస్ట్ బెందాళం కృష్ణారావు, రూరల్ రిపోర్టింగ్ మెలకువ లపై ప్రజాశక్తి సంపాదకులు వెండి తులసీదాసు , భారత రాజ్యాంగం- పత్రికా చట్టాలు అంశంపై సీనియర్ జర్నలిస్ట్ డి.సోమ సుందర్, కళింగాంధ్ర చరిత్ర జర్నలిజం పాత్ర పై సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణకు జర్నలిస్టులు హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

# సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరాలి




**సారవకోట, ఫిబ్రవరి 7(వార్త):** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేయాలని నరసన్నపేట శాసన సభ్యులు బగ్గు రమణమూర్తి సూచించారు. శనివారం సారవకోట మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సభ్యులతో విస్తృతంగా చర్చించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే మండల స్థాయిలో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలవ్వాలంటే క్షేత్రస్థాయిలో అధికారులు చురుగ్గా వ్యవహరించాలన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

ఈ సమావేశంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చిన్నాల కూర్మినాయుడు, తహశీల్దార్, ఎంపీడీవో, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### శివరాత్రి ఉత్సవాలకు విశ్రాంతి భవనం..

# భక్తులకు అందుబాటులోకి వచ్చేనా?




**జలుమూరు, ఫిబ్రవరి 7(వార్త):** ప్రముఖ పుణ్యక్షేత్రమైన జలుమూరు మండలం శ్రీముఖలింగంలో ఈ నెల 15వ తేదీ నుంచి నాలుగు రోజులపాటు నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తుల విశ్రాంతి భవనం ప్రారంభమవుతుందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం నిర్మించిన విశ్రాంతి భవనం ఇప్పటికీ అందుబాటులోకి రాకపోవడంపై స్థానికులు, భక్తుల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు దశాబ్దాల కాలం క్రితం భక్తుల కోసం లక్షలాది రూపాయల వ్యయంతో ఈ విశ్రాంతి భవనాన్ని నిర్మించినప్పటికీ, ఇప్పటివరకు పూర్తి స్థాయిలో ప్రారంభించకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రతి సంవత్సరం ఉత్సవాల సమయంలో వసతి సమస్యలు ఎదురవుతున్నప్పటికీ, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడంపై పలువురు ప్రశ్నిస్తున్నారు. మహాశివరాత్రి ఉత్సవాలకు కేవలం కొద్ది రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో ఈసారి అయినా భక్తుల విశ్రాంతి భవనం ప్రారంభమై సౌకర్యాలు కల్పిస్తారా? లేక గతంలాగే కాగితాలకే పరిమితమవుతుందా? అన్న చర్చ జరుగుతోంది. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి భక్తులకు అవసరమైన సదుపాయాలు అందించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## తాగునీటి కష్టాలు లేకుండా చూడాలి

**-ఎమ్మెల్యే శిరీష**

**పలాస, ఫిబ్రవరి 7 (వార్త):** రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు తాగునీరు కష్టాలు లేకుండా చూడాలని, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో ప్రతి ఒక్కరికి తాగునీరు అందించాలని సంకల్పంతో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, 31 వార్డుల కౌన్సిలర్లు ఇన్చార్జిలతో సమావేశమై చర్చించి ప్రణాళిక బద్ధంగా అవసరమైన నిధులను సేకరించి, ప్రజలను కూడా భాగస్వాములను చేసి త్రాగునీటి కొరత లేకుండా చక్కగా సరఫరా జరగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసరావు, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, ఏఎంసి చైర్మన్ మల్ల శ్రీనివాస్, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, లోడకల కామేష్, దువ్వాడ శ్రీకాంత్, సప్ప నవీన్, రవిశంకర్ గుప్తా, గురుటి సూర్యనారాయణ, చిన్ని, వార్డు ఇన్చార్జిలు, కౌన్సిలర్లు, పట్టణ ముఖ్య నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# పేరులో రాముడు.. సేవలో హనుమంతుడు!

**-వాసుదేవునికి క్షేత్రపాలకుడిని**

**అందించిన 'రామారావు'**

**-బ్రహ్మోత్సవాలకు ముందుగా**

**ఆంజనేయునికే పూజలు**





**మందస, ఫిబ్రవరి 7(వార్త):** ఆయన పేరులో రాముడున్నాడు.. కానీ సేవలో మాత్రం ఆంజనేయుడు.. ఆధ్యాత్మిక చింతనలో ఎంతో మంచి పేరు సాధించిన ఆయన చేయికి తిరుగులేదు.. ఆలయాలు కడుతున్నాం.. సేవా కార్యక్రమాలు చేస్తున్నామంటే తప్పకుండా స్పందిస్తారు.. ఆయనే డోకి రామారావు. కాశీబుగ్గ-పలాసకు చెందిన రామారావు మందస ప్రాంతానికి చిరపరిచితులు. వ్యాపారవేత్తగా, సమాజసేవకునిగా.. ఆధ్యాత్మికవేత్తగా డోకి రామారావు చేస్తున్న సేవలు చిరస్మరణీయమని ఈ ప్రాంతీయులు చెబుతారు.. అందుకు ఉదాహరణగా ఎన్నో సేవా కార్యక్రమాలు చెప్పుకోవచ్చును. మందస పట్టణంలోని శ్రీవాసుదేవ పెరుమాళుని ఆలయం త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో ఆలయ జీర్ణోద్ధారణ పనులు జరిగాయి. ఆలయం సర్వాంగ సుందరంగా నిర్మించారు. అప్పటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీవాసుదేవునికి క్షేత్రపాలకుడుగా హనుమంతుడు ఉంటాడు. ఈ ఆలయ నిర్మాణానికి దాతలు ఎవరని మల్లగుల్లాలు పడుతుండగా.. నేనున్నానంటూ రామారావు ముందుకు వచ్చారు. క్షేత్రపాలకునిగా శ్రీదాసాంజనేయ ఆలయాన్ని డోకి రామారావు, భాగ్యలక్ష్మి దంపతులు నిర్మించారు. అప్పటి నుంచి ప్రతీ ఏటా బ్రహ్మోత్సవాలకు దాసాంజేయునికి ముందుగా ప్రత్యేక పూజలను నిర్వహించి, బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తారు. అంతేకాదు.. ప్రతీ మంగళవారం ఆంజనేయునికి అర్చకులు పూజలు నిర్వహించి, భక్తులు తీర్థ, ప్రసాదాలు అందజేస్తారు. అక్కడితో రాముని సేవలు ఆగిపోలేదు. క్షేత్రపాలకుని ఆలయమైతే నిర్మించారు.. భక్తులు నిలువ నీడలేదని ఆలయ ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు రామారావుతో చెవిలో చెప్పారు. ఇంతేనా.. భక్తులకు ఎండ, వాన నుంచి రక్షణకు ప్రత్యేక నిర్మాణం చేయండని, ఆ నిర్మాణ వ్యయం కూడా తానే భరించారు.. 17వ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. రామారావు సేవలు హనుమంతునికి చాలలేదన్నట్టు మళ్లీ వేదపండితులు స్వామివారి ఆదేశమంటూ.. మరో విన్నపాన్ని డోకి రామారావు ముందుంచారు.. దీనికి కూడా రామారావు కాదనలేదు. ఎంత వ్యయమైనా.. భరిస్తానని హామీ ఇచ్చారు. హనుమంతుని సేవలో తరిస్తానన్నారు. ఆలయం ముందర భాగంలో పూర్తిస్థాయిలో భక్తులకు రక్షణ కల్పించడానికి నిర్మాణాలు చేయాలని ఆలయ అభివృద్ధి కమిటీ, అర్చకులు కోరడంతో తప్పక నిర్మిస్తానని రామారావు చెప్పారు. శ్రీవాసుదేవుని భక్తుడైన డోకి రామారావు చేస్తున్న సేవలను వేదపండితులు, అర్చకులు, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. శ్రీవాసుదేవుని కృపా, కటాక్షాలు ఎల్లవేళలా ఉంటాయని ఆశీర్వదించారు.

## సమస్యలు పరిష్కరించరూ..!



**సోంపేట, ఫిబ్రవరి 7 (వార్త):** కొర్లం నుంచి మా కన్నపురం, పొట్టంగి గ్రామాల వరకు కొన్ని ముఖ్యమైన సమస్యల పరిష్కారానికి వెంటనే కృషిచేసి ప్రజలకు మేలు జరిగే విధంగా తగు చర్యలు తీసుకోవాలని మా కన్నపురం సర్పంచ్ మద్దిల నాగేశ్వరరావు, కంచిలి ఏఎంసి చైర్ పర్సన్ మద్దిల విజయలక్ష్మి తో పాటు పలువురు టిడిపి నాయకులు ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ అశోక్ను శనివారం క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా కొర్లాం నుంచి బాకన్నపురం వెళ్లే రహదారిని విస్తరించి కొత్తగా నిర్మాణం చేయాలని కోరారు. కొత్తంగి వెళ్ళే రోడ్డులో మా కన్నపురం చింతలచెరువు వద్ద శిథిలావస్థలో ఉన్న కల్వర్టు నిర్మాణం చేయాలని కోరారు. బాతు పురం రోడ్డులో గుడియా బంధ వద్ద శిథిలావస్థలో ఉన్న కల్వర్టును పునర్నిర్మాణం చేయించాలని కోరారు. పొత్తంగి వెళ్లే ఆర్టీసీ బస్సును మా కన్నపురం వరకు పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు బతకల జోగారావు మల్ల కోదండరావు దుర్గాసి మాధవరావు పి ఆనందరావు ఎం ఆర్ లింగరాజు ఎస్ యాదగిరి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## బారువ యూబీఐ తీరుపై బీసీ సంఘం అసంతృప్తి



**సోంపేట, ఫిబ్రవరి 7 (వార్త):** బారువలో గల యూనియన్ బ్యాంకు తిరుపట్ల అఖిలభారత బీసీ వెల్ఫేర్ సంఘం నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉదయం 10:30 గంటల వరకు బ్యాంకు తలుపులు తీయకపోవడం, ఖాతాదారులు బ్యాంకు ఉద్యోగుల రాక్ కోసం నిరీక్షించడం, బ్యాంకు మేనేజర్ 11 గంటలకు రావడం మొదలైన సమస్యలు ఎక్కడ నిత్యకృత్యంగా మారాయని వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఎస్ జి ప్రసాద్ ఎస్ నరసింహులు గోవిందరాజులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీకాకుళంలో గల రీజనల్ కార్యాలయానికి ఫోన్లో మాట్లాడి బారువ యూనియన్ బ్యాంక్ తీరుపై ఫిర్యాదు చేశారు. పరిస్థితి ఇప్పటికైనా మారకపోతే ఖాతాదారుల తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## తామరపల్లిలో ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ



**నరసన్నపేట, ఫిబ్రవరి 7(వార్త):** తామరపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీకాకుళం నుంచి టెక్కలి వైపు వెళ్తున్న లారీ, అదే దిశలో ప్రయాణిస్తున్న ట్రాక్టర్ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. ట్రాక్టర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కావడంతో సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పెను ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న నరసన్నపేట పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి. గణేశ్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తక్షణమే చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## కీర్తిపురం మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 7(వార్త):** కీర్తిపురంలో ఇటీవల అనారోగ్యం తో మాజీ సర్పంచ్ వలపల మహాలక్ష్మీ మృతి చెందారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాలం అశోక్ ఆ కుటుంబాన్ని పరామర్శించారు. కీర్తిపురం వలపల నరహరి ఇంటికి వెళ్లి పరామర్శ చేశారు. ఈ కార్యక్రమ లో మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్ష, కార్యదర్శిలు లోపింటి పద్మనాభం డి కామేశ్వరరావు, ఎస్ సహదేవ్, పి బాబ్జీ,డి.శ్రీను,ఎం.సూర్యనారాయణ, పి.దుర్యోధన,డి. రామరావు, పి. చంద్రశేఖర్ రెడ్డి, బోరు పద్ర లోహిదాస్,వి. ధర్మరాజు,కె. క్రిష్ణ ,యు.శంకరనారాయణ, ప్రకాష్ నాయక్,గిన్ని బాలరాజు, పంచన బెహరా,మురళి తదితరులు పాల్గొన్నారు.

## నిరంజన్ కు ఘన సన్మానం



**పలాస, ఫిబ్రవరి 7 (వార్త):** ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన రైతు సంఘ నాయకుల సదస్సులలో ముఖ్యమంత్రివర్యులు చేతుల మీదుగా సన్మానించబడ్డ పలాస నియోజకవర్గం వాసి శ్రీకాకుళం జిల్లా నీటి సంఘాల డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్షులు గొణప నిరంజన్ కి శనివారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అభినందించారు. శనివారం పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష నిరంజన్ కు అభినందన తెలుపుతూ సన్మానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ పదవి అంటే అధికారం కాదు-పదవి అంటే బాధ్యత అని నమ్మి ఏమి ఆశించకుండా తన బాధ్యతను మనస్ఫూర్తిగా నిజాయితీగా శ్రమించి రైతులతో మమేకమై రైతుల సాగునీటి సమస్యలను, ఒడిదడుగులను తెలుసుకొని తన బాధ్యతను విజయవంతంగా నిర్వర్తించినందుకు నిరంజన్ కి ఈ పలాస నియోజకవర్గం తరఫున మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి వజ్రపుకొత్తూరు మండల ముఖ్య నాయకులు, మున్సిపాలిటీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు హక్కులకు 'రాజముద్ర' రక్షణ

**నందిగాం, ఫిబ్రవరి 7 (వార్త):** "భూమి అనేది రైతులకు అత్యంత విలువైన ఆస్తి. భూమిపై రైతులకు సర్వహక్కులు కల్పిస్తూ, భవిష్యత్తులో ఎటువంటి వివాదాలకు తావులేకుండా ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేస్తున్నాం" అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శనివారం నందిగాం మండలం చిన్న తామరాపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన రైతులకు కొత్త పాసుపుస్తకాలను అందజేశారు.

## వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్' బిల్లును వెనక్కి తీసుకోవాలి

**కేంద్ర బడ్జెట్లో విద్యకు 10% నిధులు కేటాయించాలి**

**ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్ రవి**

**కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద నిరసన**




**పలాస, ఫిబ్రవరి 7 (వార్త):** విద్యా రంగంలో సంస్కరణల పేరిట కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ 2025 బిల్లును వ్యతిరేకించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్ రవి డిమాండ్ చేశారు. శనివారం కాశీబుగ్గ బస్టాండ్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బిల్లు ఉన్నత విద్యపై కేంద్రం నియంత్రణకు దారితీస్తుందని హెచ్చరించారు. రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా, రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందన్నారు. యూనివర్సిటీల అభివృద్ధి కోసం ఏర్పడిన యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్సీటీఈలను రద్దు చేసి, వీటిని హెచ్ సీఐ పేరుతో ఒకే గొడుగు కిందకు తేవడంతో విద్య కేంద్రీకరణకు కేంద్రం పాల్పడుతోందని అన్నారు. విద్య కార్పొరేటీకరణ, వ్యాపారీకరణ చేస్తూనే జ్ఞాన వ్యవస్థ పేరుతో హిందూత్వ అజెండాను అమలు చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని, అందుకే ఈ బిల్లును తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు. వికసిత్ భారత్ వినియమన్ పరిషత్ (నియంత్రణ), వికసిత్ భారత్ శిక్షా గుణవత్ పరిషత్ (అక్రిడిటేషన్), వికసిత్ భారత్ శిక్షా మానక్ పరిషత్ (ప్రమాణాలు) లౌకిక వ్యవస్థకు భిన్నంగా కార్పొరేట్లకు అనుగుణంగా ఉన్నాయన్నారు. ఇప్పటికే యూనివర్సిటీ విద్యార్థులు, ప్రొఫెసర్లపై భాషా-ప్రాంతా-కులం పేరుతో దాడులు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని ప్రైవేటు వర్సిటీలో విద్యా వ్యాపారాన్ని అరికట్టాల్సిన ప్రభుత్వాలు వికసిత్ భారత్ శిక్ష అధిష్ఠానం అంటూ కార్పొరేట్ విద్యా సంస్థల బిల్లు తేవడంతో ఉన్నత విద్యకు చేటని అన్నారు. తక్షణమే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన స్వీకారం చూడదామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కే సాయి, ఏఐఎస్ఎఫ్ నాయకులు అశోక్, గణపతి, నితిన్, సాహిల్ మణికంఠ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## శ్మశానవాటికను కబ్జా చేస్తే సహించేది లేదు

**- వ్యాపాస్తులకు ఆటంకం చేయటం లేదు**

**-న్యాయం చేయాలని క్రైస్తవ పెద్దల వినతి**



పలాస, ఫిబ్రవరి 7 (వార్త): క్రైస్తవ స్మశానవాటికకు ఆనుకుని ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలని, క్రైస్తవ మత బోధకుడు దుకాణ యజమానులను కోరిన నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొందని, ఈ పరిణామాల నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ క్రైస్తవ మత పెద్దలు శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మత పెద్దలైన బోస్ బాబు, అనిల్ రాజు,పాయిజ్ అహ్మద్ (ఘని) తదితరులు మాట్లాడుతూ గతంలో రోడ్డు విస్తరణలో భాగంగా మున్సిపల్ అధికారుల విన్నపం మేరకు క్రైస్తవ స్మశానవాటికలో కొంత భాగాన్ని కోల్పోయామని తెలిపారు. తాజాగా నిర్మించిన ప్రహారీ గోడకు ఆనుకుని దుకాణాలు ఏర్పాటు చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవ ఆచారం ప్రకారం స్మశానవాటిక ప్రహారీ గోడపై క్రైస్తవ సువార్త వాఖ్యాలు రాయాల్సి ఉంటుందని, దుకాణాలు గోడకు ఆనుకుని ఉండటంతో ఆచరణలో ఇబ్బందుల ఎదురవుతున్నాయని వివరించారు. ఈ కారణంగానే దుకాణ యజమానులను ఫుట్పాత్పై కాకుండా రోడ్డుపై ఏర్పాటు చేసుకోవాలని మాత్రమే కోరామని స్పష్టం చేశారు. పాదచారుల సౌకర్యం కోసం మున్సిపాలిటీ నిర్మించిన ఫుట్పాత్పై దుకాణాలకు అధికారులు ఎలా అనుమతిస్తారన్న సందేహాన్ని వారు వ్యక్తం చేశారు. గతంలో దుకాణాలను ప్రహారీ గోడకు దూరంగా ఉండేలా చూస్తామని, అధికారులు హామీ ఇవ్వడంతోనే వెనక్కి ప్రహారీ గోడ నిర్మాణానికి తాము అంగీకరించామని తెలిపారు. దుకాణ యజమానుల నుంచి అద్దె వసూలు చేశారన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని మత పెద్దలు ఖండించారు. ఈ విషయంపై పాలక పక్షం ప్రతినిధులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని, ఎలాంటి పరిణామానికేనే మేం సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మత పెద్దలు మురళి, జాన్ బాబు, బిఐ కుమార్, అప్పలస్వామి, ధర్మ, విజయ, ఆశ, స్టీవెన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణతర్లకు బస్సు సౌకర్యం కల్పించండి

**- పలాస ఎమ్మెల్యేను కోరిన గ్రామస్తులు**

**పలాస, ఫిబ్రవరి 7 (వార్త):** బ్రాహ్మణతర్లకు బస్సు సౌకర్యం కల్పించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు బ్రాహ్మణతర్ల గ్రామస్తులు శనివారం వినతి పత్రం అందజేశారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష నిర్వహించే గ్రీవెన్స్ లో భాగంగా బ్రాహ్మంతర్ల గ్రామం గాంధీ మార్కెట్ వర్తక వ్యాపారస్తులు ఎప్పటినుంచో పలాస డిపో నుంచి గరుడకండి మీదుగా బ్రాహ్మణతర్ల గ్రామానికి బస్సు సౌకర్యం లేనందున హైవే మార్గం గుండా బ్రాహ్మణతర్లకు చేరుకుంటుందని వినతి పత్రం అందజేశారు.బస్సు రూట్ ను పలాస డిపో నుండి గరుడకండి మీదుగా వెంకటాపురం టెక్కలిపట్నం వయా బ్రాహ్మణతర్ల గ్రామానికి చేరుకునేలాగా బస్ సర్వీసును కల్పించాలని, పలాస డిపో నుండి గొ ప్పిలి మీదుగా కరజాడ వయా బ్రాహ్మణ తర్ల గ్రామానికి బస్ సర్వీసులో చేరుకునేలాగా బస్సుల్లో ఏర్పాటు చేసి తమ వ్యాపారానికి సహకరించగలరని ఆమెకు వినతిపతనాన్ని అందజేశారు. విషయం తెలుసుకొని వెంటనే ఆమె ఆర్టీసీ డిపో మేనేజ్ తో ఫోన్లో మాట్లాడగా ఆయన వెంటనే స్పందించి త్వరలో మీరు వివరణ ఇచ్చిన రోడ్డు రూటులను పరిశీలిస్తానని తెలియజేశారు. ఎట్టి పరిస్థితులైన ఈ యొక్క సమస్యకు పరిష్కారం చేస్తామని తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో బ్రాహ్మణతర్ల కూటమి నాయకులు శ్రీకాకుళం జిల్లా ఎస్ఎస్టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు వడ్డీ యాదగిరి గాంధీ, మార్కెట్ అధ్యక్ష కార్యదర్శులువూన. కృష్ణమోహన్, వూన. రత్నాకర్ రావు, జామి తిరుపతి, డోకి. గోపాల్, డోకి కేశవ, ఆర్యవైశ్య పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

### పొందర కులం సమస్యలను పరిష్కరించండి

బ్రాహ్మణతర్ల గ్రామంలో పొందర కులస్తులకు గతంలోనిగా 2014 సంవత్సరం ఎంపీ నిధులతో కస్పా వీధిలో శంకుస్థాపన చేసినటువంటి కమ్యూనిటీ హాల్ గురించి మరోసారి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషని కలిసి ఈ యొక్క సమస్యను పరిష్కరించి మా యొక్క కులానికి త్వరగా కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేస్తారని, పొందర కులస్తులు వినతి పత్రాన్ని అందజేశారు పొందర కులస్తులు పైరు సన్న కారు రైతులు సన్న కారు రైతులు వ్యవసాయాన్ని సాగు చేస్తుంటారు. సన్నకారు రైతులు కాయగూరలు పండిస్తుంటారు. బోర్లు వేసుకునే సౌకర్యాన్ని కల్పిస్తారని తద్వారా మా యొక్క సాగిని మరింత సాగు చేసుకునే అవకాశం లభిస్తుందని ఆమెకి తెలియజేసి వినతిపత్రాన్ని అందజేయగా ఆమె సానుకూలంగా స్పందించి త్వరలో ఈ యొక్క సంస్కృత పరిష్కారం చేస్తానని తెలియజేశారు .ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పొందర కులస్తుల యొక్క పైరు వ్యవసాయ సన్న కారు రైతులు గురించి ఎమ్మెల్యే గారితో వివరణ ఇచ్చారు. ఇందులో భాగంగా పొందర. భగవాన్, పొందర. మురళీ, అధిక సంఖ్యలో వార్తక వ్యాపారస్తులు, యువత పాల్గొన్నారు.



## పార్టీ బలోపేతమే లక్ష్యంగా కృషి చేద్దాం



**సోంపేట ఫిబ్రవరి 7(వార్త):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గం లో మరింత బలోపేతం దిశగా అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు ఆధ్వర్యంలో శనివారం ఎక్కడ జరిగిన పార్టీ సమావేశంలో పార్టీ నేతలు నర్తు నరేంద్ర యాదవ్, డాక్టర్ దాసు, తడక జోగారావు తదితరులు మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని పటిష్ట పరచాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. గ్రామాల్లోనూ పట్టణాల్లోనూ అధికార పార్టీ తీరు పట్ల ప్రజల్లో అసంతృప్తి నేల పని ఉందని అన్నారు. ప్రభుత్వం కేవలం కక్షపూరిత కుట్రపూరిత రాజకీయాలు తప్ప ప్రజా సంక్షేమానికి అభివృద్ధికి కనీసం పట్టించుకునే పరిస్థితి లేదని వాపోయారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా రాష్ట్రంలో మళ్లీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని అనుకూలంగా మలుచుకునేందుకు గ్రామస్థాయి నుంచి పార్టీ కార్యకర్తలు నాయకులు సమన్వయంతో కృషిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. సమావేశంలో జడ్పిటిసి తడక యశోద పలువురు నాయకులు సర్పంచులు ఎంపీటీసీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏ సమస్య వచ్చినా పోలీసులను సంప్రదించాలి

**-సీఐ రామకృష్ణ**

**పలాస, ఫిబ్రవరి 7(వార్త):** బాలికలకు ఎలాంటి సమస్య వచ్చినా పోలీసులను సంప్రదించాలని కాశీబుగ్గ సీఐ వై రామకృష్ణ సూచించారు. శనివారం కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నారి శక్తి, సంకల్పం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులతో సుదీర్ఘంగా మాట్లాడారు. నారీ శక్తి, మహిళల సంకల్పబలం గురించి వివరించిన సీఐ, మహిళలపై జరుగుతున్న నేరాలు, బాల్య వివాహాల దుష్పరిణామాలు, సైబర్ నేరాల నుంచి ఎలా జాగ్రత్త పడాలో విద్యార్థులకు స్పష్టంగా అవగాహన కల్పించారు. ప్రస్తుత పరిస్థితుల్లో బాలికలు ధైర్యంగా ముందుకు రావాలని, ఏ సమస్య వచ్చినా పోలీసులను సంప్రదించాలని సీఐ ఎన్ని రామకృష్ణ సూచించారు. నారీ శక్తి అంటే మహిళల అంతర్గత బలం, సంకల్పశక్తి, ఇది సమాజంలో మార్పు తీసుకురావడానికి కీలకం. మహిళల సంకల్పబలం వారిని అడ్డంకులను ఛేదించి, కుటుంబం నుంచి దేశ స్థాయికి ప్రభావం చూపేలా చేస్తుందని తెలిపారు. నారీ శక్తి భారతీయ సంస్కృతిలో దేవతల రూపంలో(దుర్గా, లక్ష్మీ వంటివి) ప్రతిబింబిస్తుందని, ఇది మహిళల సృష్టి, రక్షణ శక్తులను సూచిస్తుందని తెలిపారు. ఆధునిక సందర్భంలో ఇది లింగ సమానత్వం, విద్య, ఆరోగ్యం ద్వారా సాధికారతను ప్రోత్సహిస్తుందని, మహిళలు ఎదుర్కొనే సవాళ్లను అధిగమించి, నాయకత్వం వహించే శక్తిగా నారీ శక్తి పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్నం నాయుడు, కాశీబుగ్గ పోలీసులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546